క్లుప్తంగా

శ్మశానవాటిక రోడ్డుకు రూ.5 లక్షల నిధులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో ఎస్సీలకు సంబంధించిన శ్మశానవాటిక రోడ్డు నిర్మాణానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రూ.5 లక్షలపైగా నిధులు కేటాయించారని గ్రామ సర్పంచ్ ధారా శ్యాం తెలిపారు. శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో రోడ్డు నిర్మాణం చేయాలని ఇటీవల చేసిన విజ్ఞప్తి మేరకు మంత్రి స్పందించి వితరణ చేశారని పేర్కొన్నారు.

ఏదులాపురం అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు

ఖమ్మంరూరల్: ఏదులాపురం గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ, గ్రామ ప్రత్యేకాధికారి అశోక్ తెలిపారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ నిధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. మూడు కోట్లు, మిగిలిన నగదును విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రగతి నివేదికను వివరించారు. ఈసభలో సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి, గ్రామకార్యదర్శి కృష్ణ, గ్రామపెద్దలు దండి సురేష్, వి. సుదర్శన్‌రెడ్డి, వెంపటి రవి తదితరులు పాల్గొన్నారు.

దైవానుగ్రహంతోనే సమాజంలో శాంతి

ఖమ్మం మామిళ్లగూడెం: దైవానుగ్రహంతోనే సమాజంలో శాంతి, సౌభాగ్యం వర్ధిల్లుతుందని హదీస్ ప్రొఫెసర్ జామియా మిలియా దారుల్ ఉలూమ్ అక్కల్ కువ ముఫ్తీ ఫారుఖ్ మదనీ అన్నారు. శనివారం జమియత్ ఉలేమా ఏ హింద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మలానాసయ్యద్ అహ్మద్‌ఖాసీం అధ్యక్షతన ఖమ్మం ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో మన బాధ్యతలు అనే అంశంపై జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.జీవితంపై పవిత్ర ఖురాన్, హదీస్‌లో పేర్కొన్న అంశాలపై వివరించారు. హఫీజ్ ఎండీ జవ్వాద్ అహ్మద్ పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో మౌలానా అబ్దుల్ సత్తార్ ఖాసీం, అబ్దుల్ ఘని, మౌలానా అబ్దుల్ కరీం రశాది, ముఫ్తీ ఆసీఫ్ అలీఖాసీం, అహ్మద్ ఖాన్, మౌలానా సాబీర్ ఇశాతి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్, నీట్‌లో విద్యార్థులకు ఉపయోగం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు దోహదపడతాయని అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శనివారం నగరంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహించిన సందర్భంగా ప్రశ్నాపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు పోటుప్రసాద్, నాయకులు శివరామకృష్ణ, రామకృష్ణ, లక్ష్మణ్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం: రేషన్ షాపుల ద్వారా ఉచితంగా 12 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని కోరుతూ పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల తహసీల్దార్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం కుటుంబ సర్వే నిర్వహించి పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి నేటికి అందడంలేదని ఆరోపించారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకినపల్లి సరోజిని, కల్పన, బోస్, జగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుతారి కూలీల సంక్షేమమే ధ్యేయం

ఖమ్మం మామిళ్లగూడెం: సుతారి కూలీల సంక్షేమమే ధ్యేయంగా తమ సంఘం పనిచేస్తుందని మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరికంటి సంజీవరావు తెలిపారు. శనివారం ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాటిశెట్టి వీరేశం మాట్లాడారు. గతంలో కొందరు కార్మికులు కూలీ రెట్లు పెంచాలని తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటి విషయమై వచ్చే నెలా ఐదవ తారీకు వరకు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బండి రవి, నగర అధ్యక్షుడు శిల్పారాం బాబు, నాయకులు షేక్ బాజీ, సీతారాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్–2
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఈవిల్ డెడ్ రైజ్
ఆదిత్య	ఏజెంట్
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

– ఖమ్మంవ్యవసాయం



కారిడార్లలో పెట్టేందుకు తీసుకొచ్చిన పలు రకాల మొక్కలు



లోపలకు వెళ్లే ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మొక్కల కుండీలు



లిఫ్ట్‌ల వద్ద కుండీలో మొక్కలు ఇలా..



గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన పీస్ లిల్లీ మొక్కలు

కేఎంసీకి కొత్త శోభ..!



కేఎంసీ కార్యాలయం

సండే స్పెషల్

పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా ముస్తాబు

- 26 రకాల మొక్కలు సిద్ధం
- పార్క్‌ను తలపించేలా ఏర్పాటు
- ఆదర్శంగా నిలిపేందుకు అధికారుల కృషి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పచ్చదనంతో కనువిందు చేస్తోంది. కార్యాలయం ఆవరణ లోపల, బయట నీడనిచ్చే మొక్కలతో పాటు పూలు, పండ్లనిచ్చే మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. కార్యాలయం చుట్టూ మొక్కలు నాటడంతో పాటు కార్యాలయం లోపల అధికారుల చాంబర్ల ఎదుట, కారిడార్, లిఫ్ట్‌ల వద్ద మొక్కలతో కూడిన కుండీలను ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయం అంతా ఆహ్లాదకర వాతావరణం పంచుతుంది. కార్యాలయానికి వచ్చి వెళ్లే వారు మొక్కలను చూసి ఆహా.. అనిపించేలా అందంగా ముస్తాబు చేశారు. ఈ మొక్కలను చూసి కార్పొరేట్ కార్యాలయాల్లో చూసినట్లుగా ఉందని భావించి తమ ఇంటి వద్ద కూడా ఇలాంటి మొక్కలనే ఏర్పాటు చేసుకోవాలనుకునేలా అధికారులు ఏర్పాటు చేశారు.

హరితహారాన్ని ఆదర్శంగా తీసుకొని..

ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని కేఎంసీ అధికారులు ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటుతున్నారు. నగరంలో రోడ్ల మధ్య, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల స్థలాలు, రోడ్ల వెంట, పార్కుల్లో పెద్ద సంఖ్యలో మొక్కలను నాటారు. ఇన్‌స్టిట్యూషన్లలో మొక్కలు పెంచాలని ప్రభుత్వం పిలుపునివ్వడంతో కేఎంసీ అధికారులు తమ కార్యాలయంలో మొక్కలను పెంచాలని నిర్ణయించి నీడనిచ్చే మొక్కలను కేఎంసీ ఆవరణంలో.. పూలు, పండ్లు, క్రోటాన్ వంటి మొక్కలను కుండీల్లో పెంచి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మూడు ఫ్లోర్‌ల వరకూ ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో మొక్కల కుండీలు పెట్టడంతో కార్యాలయం అంతా కొత్త శోభను సంతరించుకుంది. ఇక కార్యాలయం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని మధ్యభాగంలో గల ఖాళీ స్థలంలో లాన్‌తో పాటు చుట్టూ నాటిన పీస్ లిల్లీస్ అందంగా కనిపిస్తూ ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి.

26 రకాల మొక్కలు..

కేఎంసీ కార్యాలయంలో మొత్తం 26 రకాల మొక్కలను అధికారులు నాటారు. బయట ఆవరణలో 10 రకాల మొక్కలు ఉండగా.. కార్యాలయం లోపల భాగంలో కుండీల్లో 16 రకాల మొక్కలు ఉన్నాయి. వీటిలో నీడనిచ్చే మొక్కలతో పాటు పూల నిచ్చే మొక్కలు ఉన్నాయి. ఇందులో అధికంగా ఉన్న చిట్టి నంది వర్ధనం, గులాబీ, చిన్న గన్నేరు వంటి పూల మొక్కలు కార్యాలయానికి వచ్చే వారికి ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. క్రోటాన్ జాతికి చెందిన మొక్కలతో పాటు ఇతర అరుదైన రకాల మొక్కలు ఉన్నాయి.

పచ్చదనం పెంపొందించడానికే..

కేఎంసీ కార్యాలయంలో పచ్చదనం పెంచేందుకు పలు రకాల మొక్కలను నాటి పెంచుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు కేఎంసీను ఆదర్శంగా నిలపాలని ఇక్కడ నుండే మొక్కలు పెంపకం ప్రారంభించాం. ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పొల్యూషన్‌ను తగ్గించవచ్చని ఎక్కువ మొక్కలు పెంచుతున్నాం.

– బి.మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

మేడేను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంవైద్య విభాగం: మేడే వారోత్సవాలను వాడవాడలా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన జిల్లా సెంటర్ పార్టీ బాధ్యుల సమావేశంలో నున్నా, ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో శనివారం మే డే పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా రామయ్య మాట్లాడారు. శ్రామిక వర్గానికి కొండంత అండగా ఉండే ఎర్ర జెండాలను వీధి వీధిన ఆవిష్కరించాలని ఆయన కోరారు. అన్ని రకాల దోపిడీల నుంచి ప్రజలను, కార్మిక వర్గాన్ని విముక్తి చేయగలిగేది.. మేడే కార్మిక వీరులు తమ రక్తంతో ఆవిష్కరించిన ఎర్రజెండా మాత్రమేనని, ఆ స్ఫూర్తితో మేడేను జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రం, సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యుడు పిట్టల రవి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.ఝాన్సీ, నవీన్ రెడ్డి, ఆర్.ప్రకాష్, ఐఎఫ్‌టీయూ నగర నాయకులు అంబేద్కర్, జగదీష్, అశోక్, భాను, లలిత, ఇందిరా, రాధా, హరీష్, నాగరాజు, చందు, నాయకులు కొండలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో మేడే సభ..

ఖమ్మంమయూరిసెంటర్: మేడే ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఖమ్మం జిల్లా సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో మేడే సభను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరావు ఆవిష్కరిస్తారని, అనంతరం జరిగే మేడే సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు.

ఘనంగా పశువైద్య దినోత్సవం



శ్రీనివాస్‌రావును సత్కరిస్తున్న వేణుమనోహర్‌రావు, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 78 మంది పశువైద్య డాక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. అదేవిధంగా వివిధ జాతులకు చెందిన ఆవుల సంతతిని ఉత్పత్తి చేస్తున్న రైతు నగరంలోని కార్పొరేటర్ చావా నారాయణరావు, నిత్యం 150 లీటర్ల సేంద్రియపాలను ఉత్పత్తి చేస్తూ ఖమ్మంలో పార్లర్‌ను నిర్వహిస్తున్న బొమ్మిశెట్టి శ్రీనివాస్‌రావు, నూతన పద్ధతిలో గొర్రెల పెంపకం నిర్వహిస్తున్న తిరుమలాయపాలెం మండలం మేకలతండాకు చెందిన అజ్మీర రవిలను సత్కరించి మెమంటోలను అందించారు. పశుసంవర్ధక, పశువైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు, ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, పశు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులకు సంఘీభావం

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలాల్లో చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. కాగా, ఈ సమ్మెకు పలు రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి గ్రామ కార్యదర్శుల డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.


– సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లిలో సంఘీభావం ప్రకటిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు



తిరుమలాయపాలెం: సమ్మెలో మాట్లాడుతున్న ప్రజాపంథా నాయకులు



కామేపల్లిలో సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ఖమ్మంఅర్బన్: నగరంలోని 13వ డివిజన్ శ్రీశ్రీ సర్కిల్‌లో 7వ డివిజన్ టేకులపల్లి భక్త ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో 108 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం ఉదయం శంకుస్థాపన చేస్తున్నట్లు దేవాలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కవి సమ్మేళనం, కవులకు సత్కారం

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచ కార్మిక దినోత్సవం 'మేడే–2023'ను కార్మిక లోకానికి సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని హర్షిణి డెవలపర్స్ కార్యాలయంలో కవి సమ్మేళనంతో పాటు శ్రీశ్రీ జయంతి వేడుకలను కూడా జరుపుకుంటున్నట్లు వికాస వేదిక సాహిత్య సంస్థ ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కా సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మేడే శ్రామిక పురస్కారాలను నల్ల కృష్ణమూర్తి, గరిడేపల్లి శోభనాద్రి, నామవరపు కాంతేశ్వరరావు, రేళ్ల శ్రీనివాస్, మందుల వీరభద్రం, గుమ్మడి పుల్లయ్య అందించనున్నట్లు తెలిపారు. కవి సమ్మేళన కార్యక్రమాన్ని గాజుల భారతి శ్రీనివాస్, రెంటాల చిన హుస్సేన్, ఎం.సంగమేశ్వరరావు, బి.శ్రీకాంత్, బి.అచ్యు, ఎం. గోవింద్, టి.శ్రీనివాస్‌రావు, కె.వసంతలు సమన్వయం చేస్తారని చెప్పారు.

వీఓఏల ధర్నా..



సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ దీపికలు

ఖమ్మంరూరల్: కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామదీపికలు శనివారం మండల సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షురాలు ఎస్.సుగుణ మాట్లాడారు. ప్రస్తుతం వచ్చే నెలకు రూ.3,900 పెరిగిన ఖర్చులకు ఎటూ సరిపోవడంలేదని, వీఓఏలు మృతి చెందితే రూ.10లక్షల ప్రమాద బీమా, ఒకే రకమైన డ్రెస్‌కోడ్, ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వీఓఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని, గ్రామీదీపికలందరినీ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు రాధ, లక్ష్మి, హేమలత, వెంకటలక్ష్మి, స్రవంతి, వెంకట్రావమ్మ, కె. విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా 'ఖిల్లా జాఫర్'



పనులను పరిశీలిస్తున్న మేయర్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖిల్లా ప్రాంతంలోని జాఫర్ బావిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శనివారం నగరంలోని 38వ డివిజన్‌లో ఖిల్లా ప్రాంతంలో పర్యటించిన మేయర్ జాఫర్ బావిలోని మురుగు తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన మురుగును తొలగించి శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. ఈ బావి పనులను త్వరగా పూర్తిచేసి పర్యాటక ప్రాంతంగా ప్రజలు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ ఆలియా షౌకత్, రియాసాత్, ఆజం, బాబి, ఇషాక్, సలీం, మోసిన్, జిలాని, డీఈ నవ్యజ్యోతి, ఏఈ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న జావీద్

రఘునాథపాలెం: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు మహమ్మద్ జావీద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గణేశ్వరంలో తడిచిన వరి, తదితర పంటలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన పరిహారం ఇంత వరకూ రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి పంట సాగు వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు భూక్యా బాలాజీ, కొంటేముక్కల నాగేశ్వరరావు, వేపకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్ రేమల్లే రమేష్, కిలారు వెంకటరమణ, నాయకులు కొర్ర కృష్ణ, భూక్యా రమణ, కొర్ర రమణ, భూక్యా మగిత్యా, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత..

మండలంలోని గణేశ్వరం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయానికి మహమ్మద్ జావీద్ రూ.25 వేలను ఆలయం కమిటీ సభ్యులకు శనివారం వితరణగా అందజేశారు.

మెడికల్ కళాశాల మంజూరుపై హర్షం



ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు కావడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు చెబుతూ శనివారం డాక్టర్స్ మెడికల్ అకాడమీ(డీఎంఏ) ఆధ్వర్యాన విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'కు ర్యాంకులు

ఖమ్మం సహకానగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించారని నగరంలోని నారాయణ కళాశాల కోర్ డీన్ వెంకటరెడ్డి, డీన్ పాటి మాధవరావు, ఏజీఎం సురేష్ బాబు తెలిపారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరంలో జి.సురేష్ 36వ ర్యాంక్, ఎ.రాఘవేంద్ర 166, బి.నిఖిల్‌చౌదరి 2,311, బి.వినయ్ 6,801, సీహెచ్.మాన్విత 6,984, ఎస్.రంగమయి 9,715వ ర్యాంక్‌లు సాధించారని పేర్కొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

నేలకొండపల్లి: మిల్లర్ల తరుగు పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాల్తీయా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరుగు పేరుతో దాదాపు 5 నుంచి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు.మిల్లర్ల తరుగు వలన కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు కాంటాలు జాప్యం చేస్తున్నారని, దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. తరుగు దోపిడీని అరికట్టకపోతే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా బోనాలు



బోనాల పండుగలో పాల్గొన్న ఎంపీపీ

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడులో శనివారం బంగారు మైసమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బెల్లం ఉమ మహిళలతో కలిసి బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిబోయిన దరగయ్య, శ్రీధర్, నరేందర్, రవి, రామారావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మానికి చేరిన 'జన చైతన్య యాత్ర'

ఖమ్మం వైరారోడ్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ ఉద్యమకారుడు తిప్పన సిద్దుల, పలువురు మహిళల ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి సిరిసిల్ల వరకు చేపట్టిన ఒక్క నిమిషం జన చైతన్య బైక్ యాత్ర శనివారం ఖమ్మం నగరానికి చేరుకుంది. ఈ యాత్రకు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆర్జేసీ కృష్ణ స్వాగతం పలికి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, పసుమర్తి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వీరన్నస్వామి జాతర

హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు



ఖమ్మం–సూర్యాపేట జట్ల మధ్య సాగుతున్న పోటీ

నేలకొండపల్లి: మండలంలోని శ్రీవీరన్న స్వామి జాతర రెండో రోజు భక్తులతో సందడిగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించగా.. పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతేకాక తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళ కబడ్డీ పోటీలు హోరాహోరీగా నడుస్తుండగా.. తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాగం హనుమంతరావు, దేవాలయం కమిటీ అధ్యక్షుడు చావా కోటయ్య, ప్రతినిధులు రావెళ్ల కృష్ణారావు, నున్నా రవికుమార్, చావా కిరణ్, బాగం హేమంతరావు, ఏలూరి శ్రీనివాసరావు, రామారావు, వీరశేఖర్, బెల్లం వాసు, బొల్లినేని వెంకటేశ్వరరావు, చావా హరి, తదితరులు పాల్గొన్నారు.

దళితులను కించపరిస్తే సహించేది లేదు

నేలకొండపల్లి: దళితులను కించపరిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని నేలకొండపల్లి తహసీల్దార్ దారా ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని బుద్ధారం గ్రామంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. కుల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక దేవాలయంలో దళితులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్సై జి.స్రవంతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పతానపు నాగయ్య, సర్పంచ్ సామినేని శిరీష, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దారి పొడవునా ధాన్యం రాశులే..



కూసుమంచి: కూసుమంచి–పోచారం రహదారి పక్కన ధాన్యం రాశులు



నేలకొండపల్లి: సింగారెడ్డిపాలెంలో ఎగుమతి కాక రోడ్డుపై నిలిచిపోయిన ధాన్యం బస్తాలు

ఆయా గ్రామాల్లో రహదారులపై ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. పంట చేతికి రావటంతో రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని వ్యాపారులకు విక్రయిస్తుంటే మరికొందరు ఐకేపీ,సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యం అమ్ముకుంటున్నారు. ఈక్రమంలో రైతులు కల్లాలు లేక రోడ్ల పొడవునా ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. కూసుమంచి మండలంలోని కిష్టాపురంలో రైతులు కిలోమీటర్ల కొద్ది కూసుమంచి–పోచారం రహదారిపై కుప్పలుగా ఉంచారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలో కాంటాలు వేసి ఎగుమతుల కోసం ఎదురుచూస్తున్నారు.

– కూసుమంచి/నేలకొండపల్లి